27

కథ

"మనం తోటకి పిక్‌నిక్ వెడుతున్నామోచ్..." అనౌన్స్ చేశారు నాన్న.
"ఏ... ఏ... ఏ..." ఆ అరుపు మా రఘుగాడిది. ఏ ఎమోషన్‌నయినా ఇలాటి కేకల ద్వారానో, ఎగురుతూనో వ్యక్తీకరించటం అలవాటు వాడికి.
"మళ్ళీ ఏమయిందిరా?" గాభరాగా మా బామ్మ అలివేణమ్మ రానే వచ్చింది. ఆవిడకిలాంటి కేకలూ గంతులూ చిందులూ అస్సలు నచ్చవ్.
"ఏం లేదమ్మా. రేపు తోటకి తీసుకెడతానందర్నీ అని చెప్పానంతే" నాన్న ఆవిణ్ణి శాంతపరిచారు. బామ్మ మొహం కూడా వికసించింది.

మాకిప్పటి వరకూ స్థిరాస్తి అంటూ ఏం లేదు. మా తాతగారి స్నేహితుడొకాయన యు.ఎస్.లో ఉన్న కొడుకు దగ్గరికి పర్మినెంటుగా వెళ్ళిపోతూ వారి తోటని అమ్మజూపితే తాతా, బామ్మా పోరుపెట్టి నాన్నచేత కొనిపించారీమధ్యనే.

'తోట చాలా బావుంది. చెట్లన్నీ గుమ్మటంగా చూడముచ్చటగా ఉన్నాయ్. చాలా నీట్‌గా మెయిన్‌టెయిన్ చేశారిప్పటిదాకా' తోటని చూసొచ్చి నాన్న దాన్ని వర్ణించి చెప్పిన దగ్గర్నుంచీ వెళ్ళి చూడాలని అందరూ తెగ ఉబలాట పడుతున్నారు.

తోట చూడ్డం వరకూ నాకూ ఓకేగానీ, రోజంతా మా బామ్మ కనుసన్నల్లో మెదలాలంటే... హెల్. కదిలినా మెదిలినా తప్పులెంచి చివాట్లేస్తూనే ఉంటుంది. ప్చ్, ఏం చేస్తాం... తప్పదు.

ఆదివారం ఉదయాన్నే కార్లో బయల్దేరాం అందరం. వెళ్ళే తోవలో రెండు మూడు చిన్న ఊళ్ళలో పేరుపడ్డ దేవాలయాలున్నాయంటే వాటిని సందర్శించుకున్నాం. ఇది మా బామ్మగారి కోరికలెండి. ఆ తరవాత తిన్నగా తోటకి చేరుకున్నాం.

చుట్టూరా దట్టంగా వెంతుమ్మ చెట్లకంచె. గట్టి ఇనుపగేటు దాటుకుని లోపలికి వెళ్ళింది కారు. డోర్ తెరిచి కాలు కిందపెట్టాను. నాన్న మాట అతిశయోక్తి కాదు. ఎంట్రెన్స్‌లోనే తోట చాలా చాలా నచ్చింది నాకు. చెట్లన్నీ నవనవలాడుతూ కవాతుకు సిద్ధమైన జవానుల్లాగా వరుసలు వరుసలుగా తీర్చిదిద్దినట్టు చక్కగా ఉన్నాయ్.

మాకోసమే ఎదురుచూస్తున్నాట్ట తోటమాలి. "నమస్కారం సారూ, రండమ్మా రండి" అని వినయంగా ఆహ్వానించాడు మమ్మల్ని.

"ఇతని పేరు అర్జునుడు. మన తోట చూస్తోన్నదితనే" పరిచయంగా చెప్పారు నాన్న.

'అర్జునుడు... నైస్ నేమ్' ధనుర్బాణాలు లేవుగానీ అంత దృఢంగానూ ఉన్నాడతను. ఇంకొంచెం ముందుకు తీసుకెళ్ళి మాకోసం శుభ్రంచేసి సిద్ధంచేసిన చోటు చూపించాడు.

కింద కొమ్మలవీ లేకుండా పైన మాత్రం దట్టంగా పెరిగిన మామిడి చెట్టది.

అర్జునుడూ, డ్రైవరూ కలిసి కార్లో మేం తెచ్చుకున్నవన్నీ చకచకా అక్కడకు చేర్చేశారు. అదనంగా అర్జునుడు... వాళ్ళింట్లోవి అనుకుంటా రెండు ప్లాస్టిక్ కుర్చీలూ, రెండు కొత్త తాటాకు చాపలూ మోసుకొచ్చాడు.

చాపల మీద బ్లాంకెట్లు పరిచి కేస్ బుట్టల్లోంచి ఒక్కొక్కటే తీసి బయటపెట్టారు అమ్మా, బామ్మా. బ్రేక్‌ఫాస్ట్ టైమ్ దాటి చాలా సేపయిందేమో ఆకలి కరకరమంటోంది. రఘుగాడయితే "ఇంకా ఎంతసేపమ్మా" అంటూ కేసరోల్ మూత తీసి వేలితో రుచి చూడబోయాడు. ఆ చేతిమీద ఒక్కటేసింది బామ్మ. అమ్మ నవ్వుతూ అందరికీ ప్లేట్లలో టిఫిన్ సర్ది ఇచ్చింది.

డ్రైవరుకీ, అర్జునుడికీ బామ్మ స్వయంగా పెట్టి ఇచ్చింది టిఫిన్- బాగా తగ్గించి.

టిఫిన్ తింటూనే నాన్నా, తాతా

# మధురస్మృతి

## - వలివేటి నాగచంద్రావతి




అర్జునుడితో మాటల్లోపడ్డారు- ఫలసాయం, ఎరువులూ, బోర్లూ, ట్రాక్టర్లూ అంటూ. అవీ ఇవీ సర్దుతూ అమ్మా... బ్లాంకెట్ మీద కాళ్ళారజాపు క్కూర్చుని బామ్మా... మధ్యమధ్య వాళ్ళతో మాట కలుపుతున్నారు. రఘుగాడి చేతిలోకప్పుడే 'ఐపాడ్' వచ్చేసింది. ముందే తీసేసుకోకపోతే అది నా చేతిలో కొచ్చేస్తుందని ఆ గడుగ్గాయికి తెలుసు.

నేను మెల్లగా లేచాను. మా రంధ్రాన్వేషకురాలు 'ఆ హైహీల్స్ వేసుకున్నావా.

క్షిప్పయి పడేదాకా మాట వినవుగా నువ్వు' అనో, 'ఎగిరెగిరిపోతూ ఆ జుట్టేమిటే... దిక్కుమాలిన ఫ్యాషనూ నువ్వూనూ' అనో వంకలు పెట్టేలోపు బామ్మగారి దృష్టి నుంచి తప్పుకుని అమ్మకి మాత్రం చేత్తో సైగచేసి సెల్ తీసుకుని తోట లోపలిభాగంవైపు నడిచాను.

ఆకుపచ్చటి గడ్డి తివాచీ మీద వంకరటింకరగా సాగిన సన్నని కాలిబాట. దారికి రెండువక్కలా పూతకు సిద్ధంగా మొగ్గతొడిగిన మామిడిచెట్లు... మధ్యమధ్యలో ఓ జామచెట్టో లేదా ఓ సపోటా చెట్టో... కొమ్మల్లో దాక్కుని వీనులవిందుగా 'కూ' అంటున్న కోకిలమ్మ... అందుకు బదులుగా కవ్విస్తూ కొంచెం దూరంగా ఇంకొక కమ్మని కూజితం... జామచెట్టు మీద పండు కొరుకుతూ రెక్కలల్లల్లాడించి నా అందం చూడమంటున్న చిలకమ్మ... ఆ వెనక కంచె పక్కన తాటిచెట్టుకు అల్లుకుని విరగబూసిన అడవి పూలతీగలు.

'ఆహా, ఆకులో ఆకునై, పూవులో పూవునై...' కృష్ణశాస్త్రి గీతం ఇలాంటప్పుడు కదూ పాడుకోవాల్సింది...

"మీకు పక్షులంటే ఇష్టమా?"

ఉలిక్కిపడి వెనక్కి చూశాను. నా వయసే ఉన్న ఓ అమ్మాయి. ఎర్రపువ్వుల పరికిణీ,

చిలకాకుపచ్చ ఓణీ, మెడలో రంగురంగుల పూసలదండ. చామనచాయ... కళ్ళల్లో చురుకుతనం... మొహంలో స్నేహాన్నభిలషించే మందహాసం.

"ఊ" అన్నాను అప్రయత్నంగా.

"అర్జునుడు మా నాన్నే. మేమిక్కడే ఉంటాం. అదిగో దూరంగా ఆ చెట్లమధ్య కనిపించే ఇల్లు మాదే" అని చెప్పి, "నాతో రండి, మీకిష్టమైంది ఇంకోటి చూపిస్తా" ఉత్సాహంగా నా చేయి పుచ్చుకుని ముందుకు తీసుకువెళ్ళింది చనువుగా.

ఓ మామిడిచెట్టు- పెద్దదేగానీ ఏ గాలివానకో ఓ పక్కకి ఒరిగింది. వాలిన కొమ్మల్లో ఓ గూడు. గూట్లోంచి కిచకిచ శబ్దం. ఆ అమ్మాయి చెప్పినట్టు అతి నిశ్శబ్దంగా అందుబాటులో ఉన్న ఓ చిన్నకొమ్మ పైకి ఎక్కి చూశాను. గూటి లోపల నాలుగు బుల్లిబుల్లి పిట్టలు. లేత నీలిరంగు రెక్కలు వస్తూ వస్తూ ఉన్నయ్. పసుపుపచ్చని ముక్కులు ముద్దొస్తూ కువకువలాడ్తున్నాయ్ చిన్నచిన్నగా.

'వావ్... ఇలా చూడగల అవకాశం నిజంగా అపురూపం.'

"ఇక దిగండి" గుసగుసగా అన్నదా అమ్మాయి. దిగాను. "నీలిపిట్ట అంటారు దీన్ని. ఇంకాసేపు ఉంటే తల్లొచ్చేస్తుంది. వచ్చేసెయ్యండిటు" అంది మేం చేసిన తప్పు తల్లికి తెలియకూడదు అన్నట్టు. నేను తలూపాను.

"ముందింకా చాలా తోట ఉంది, రండి చూపిస్తాను" అంది చురుగ్గా ముందుకు నడుస్తూ.

'పదిహేనెకరాల పెద్ద తోట. మరీ లోపల్లోపలికి వెళ్ళిపోతే తిరిగి రాగలనా' అని చిన్న అనుమానం ఇందాక. 'ఇక పర్లేదు, మావాళ్ళందరికంటే నేనే ముందు తోటంతా చూసేస్తా' ఆ అమ్మాయి వెనకే ఆ ఎగుడూ దిగుళ్ళ మట్టి నేలమీద పడుతూ లేస్తూ వెడుతూ అనుకున్నాను ఆనందంగా.

"మీకో వింత చూపించనా?"

'ఈ అమ్మాయి చూపించేవన్నీ వింతలేనా?' నేను 'ఊ' అనకముందే "ఆ కొమ్మవంక చూడండి- మీకు తెలుగు వచ్చు కదూ" అంది.

గమ్మత్తుగా ఆ చెట్టుకొమ్మ ఒకటి 'న'కి ఏత్వం ఇస్తే 'నె' ఆకారంలో ఉంది. దానిపక్కనే ఇంకో కొమ్మ 'మ' లాగా, ఇంకోటి 'లి'లాగా ఆకుల్లేకుండా కొమ్మలే అక్షరాలుగా రూపుదిద్దుకున్నట్టు స్పష్టంగా కనిపించినయ్. 'వావ్, ఎంత విచిత్రం!'

"చదివారా వాటిని?" నవ్వుతూ అడిగిందా అమ్మాయి.

అప్పుడు చదివాను కలిపి. "నెమలి" అన్నానాశ్చర్యంగా.

"అవును. అది నా పేరే. నేను



పుట్టినప్పుడు ఇది ఇంకా లేత చెట్టే. మా తాత ఎంతో శ్రమపడి ఈ కొమ్మల్నిలా జాగ్రత్తగా వంచి, అక్కడ మాత్రం ఆకులు రానీకుండా ముదరనిచ్చాడట" ఉత్సాహంగా చెప్పి, "తాత ఇప్పుడు లేడు. ఆయనకి నామీదున్న అభిమానానికి గుర్తుగా ఇది ఉంది" అంది నెమలి చివరిగా స్వరంలో ఆర్ద్రత నింపి.

అభిమానం మాటెలా ఉన్నా అది కనబరిచిన విధానం, ఆ ఆలోచనా నిజంగా అమోఘం.

"రండి, మా ఇంటికి దగ్గరగా వచ్చేశాం. వస్తారా మా ఇంటికి?" సంకోచిస్తూ అడిగినట్టనిపించింది నాకు.

"ఎందుకు రాను? పద, చూద్దాం... మీ ఇంట్లో ఏం విశేషాలున్నాయో" అన్నాను హుషారుగా.

సిమెంటు రాళ్ళతో కట్టిన చిన్న ఇల్లు. ఒకే ఒక్క హాలు- 'సావడి' అంటారట. ఇల్లంతా సుద్దతో చక్కగా ముగ్గులు పెట్టారు. ఒక మూలన వంట, ఇంకోపక్క పడకలు. సామానే లేదు... రెండుమూడు పెట్టెలు మినహా. ఎంత గొప్ప సింప్లిసిటీనో.

పెరట్లో ఓ మామిడిచెట్టుకు ఆవు ఒకటి కట్టేసి ఉంది. దానికో దూడ. దగ్గరగా వెళ్ళాం.

"ఇది మా లచ్చిమి" అవునన్నట్టు తలూపింది ఆవు. "తువ్వాయి పేరు రాముడు. దీని ఫ్రెండు సీత."

"సీతెవరు?"

"పిలవనా... ఇదిగో వస్తోంది చూడండి."

నెమలి 'సీతా సీతా' అని పిలుస్తూ ఒక లయలో చప్పట్లు చరిచింది. మామిడిచెట్టు తొర్రలోంచి ఉడత ఒకటి తల ఒక్కటే బయటపెట్టి టిక్‌టిక్ చప్పుడు చేస్తూ అటూ ఇటూ చూసింది.

"అదిగో అదే సీత. సరే ఇక వెళ్ళులే... ఏం పనిలో ఉన్నావో ఏమో" అంది నెమలి.

గబాలున తల లోపలికి లాక్కుంది సీత. భలే వింతలు. భలే సరదాగా అనిపించింది.

నెమలి వాళ్ళమ్మ బాగా మీగడ వేసిన పాలు ఇచ్చింది మాకు ఎంతో ఆప్యాయంగా. "ఇక్కడికి మనుములు అట్టే రారు కదమ్మా. ఎవర్నన్నా చూస్తే దీనికి ప్రాణం లేచొస్తుంది. మిమ్మల్నీ బాగా విసిగించేసుంటుంది" అంది కూతుర్ని మురిపెంగా చూసుకుంటూ.

"నెమలిని చదివించలేదా?" హఠాత్తుగా అడిగాను- ఎందుకో అడగాలనిపించింది.

"ఎందుకు చదవలా- ఏడు క్లాసుల వరకూ స్కూలుకెళ్ళి చదువుకున్నాను. ఇప్పుడేమో అమ్మ దగ్గర వంట చేయడం, ముగ్గులు పెట్టడం, వెన్న తీయడం నేర్చుకుంటున్నా" అంది నెమలి ఆరిందలాగా.

"అవునమ్మా, మాబోటివాళ్ళకు అంతకంటే చదువెందుకమ్మా. వచ్చే ఏడాది లగ్గం వేసేస్తాం. మా తమ్ముడే, తూర్పున వ్యవసాయం చేసుకుంటున్నాడు" అంది వాళ్ళమ్మ.

"ఇక వెడదాం" అన్నాను.

"అలాగే. అమ్మకో బిందెనీళ్ళు తెచ్చిచ్చి వెళ్ళిపోదాం, ఏం?" అంది నెమలి ఖాళీ బిందె తీసుకొస్తూ... "మీరూ రండి. గిలకబావి చూపిస్తా. మీ బస్తీలో చూసుండరు" నడుస్తూనే పిలిచింది.

ఇంటికి సుమారు ఇరవై గజాల దూరంలో ఉంది బావి. తోటలో మూడు బోర్లు ఉన్నాయి కానీ నీళ్ళు చప్పగా ఉంటాయట. ఇంటిక్కావాల్సిన నీళ్ళు ఇక్కణ్ణుంచే మోసుకుంటారట.

బావి గొప్పగా అనిపించలేదుగానీ దాని దగ్గరకు వెళ్ళే తోవ మాత్రం అద్భుతంగా ఉంది. దారికి రెండుపక్కలా ఆకుపచ్చటి పచ్చిక మధ్య పూలమడులు. అవి కూడా ఎలాగ... సీతాకోకచిలకల్లాగా, మామిడి పిందెల్లాగా, గోపురంలాగా... ఒక్కొక్కటీ ఒక్కొక్క రంగుపూలతో ప్లాను గీసి పెంచినట్టు ఎంతో గొప్పగా.


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. వాదం ఏదైనా, కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించ గలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ తెల్ల కాగితంలో ఏడు అర ఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-82.

నేను ఆసక్తిగా చూడ్డం గమనించి చెప్పింది నెమలి- "నీళ్ళ చెమ్మకి తోట అంతటా పేరు కూడా తెలీని చిన్నిచిన్ని మొక్కలు లెక్కలేనన్ని మొలుస్తాయి. అటు చూడండి. అలాగ. అమాయకంగా బోలెడు పూలు పూస్తూంటాయి. మూగగా కాళ్ళకింద నలిగిపోతుంటాయి. ఆ మొక్కల్ని జాగ్రత్తగా పెకిలించి తెచ్చి ఇలా పాతిపెట్టి పెంచాను. నేలమీద వేసిన బొమ్మల్లాగా లేవూ... ప్చ్, ఏం తోచక ఏదో పిచ్చి పనులు" అంది కాస్త బిడియంగా.

పిచ్చి పనా? ఎంత కళా హృదయం, ఎంత ఓపిక, ఎంత ఇష్టం ఉంటే చేయగలరు ఇలాటి పనులు..?

బావికి దూరంగా ఓ చెట్టుకింద పెద్ద పాముపుట్ట. దాన్నిండా పసుపూ, కుంకుమా. భయంభయంగా వేలెత్తి చూపించాను.

"అదా... నాగులోరి తోట. దూరంనుంచే దణ్ణం పెట్టుకోండి" అంది నెమలి భక్తిగా.

బిందె ఇంట్లో దింపి వెనక్కి తిరిగాం. నిజంగానే కబుర్లపోగు నెమలి. చెప్పింది చెప్పకుండా చెప్తూనే ఉంది ఏవేవో. పక్కంటే వస్తోందా... తిన్నగా నడవనే నడవదు. వంగి ఏ గడ్డిపరకో పీకి కొరుకుతుంది. ఎగిరి ఏ కొమ్మో అందుకుని 'సాధించాను' అన్నట్టుగా ఒదిలేస్తుంది. లేదా చెట్టు దిగుతున్న ఏ తొండనో మళ్ళీ పైకి తరిమి వెనక్కొస్తుంది. ఇన్ని చేస్తున్నా మధ్యమధ్య మెళ్ళో పూసలదండకున్న లాకెట్‌ని శ్రద్ధగా కళ్ళకద్దుకోటం మాత్రం మరిచిపోదు. మొదట్నుంచీ చూస్తూనే ఉన్నాను ఈ పనిని.

"ఏ దేవుడున్నాడు దాన్లో?" అన్నాను నవ్వుతూ.

"దేవుడా... కాదు, ఇది తాయెత్తు. కొండదేవర దీవెన. మా అవ్వకి శ్రీశైలం అడవుల్లో ఉండే కోయదొర ఇచ్చాట్ట. ఇద్దగ్గరుంటే అపజయమంటూ ఉండదంట. మా అవ్వకి నేనంటే చెప్పలేనంత ఇష్టం. అందుకనే నేను గొప్పదాన్ని అవ్వాలని తను వేసుకోకుండా నా మెళ్ళో వేసింది దీన్ని. మీకు తెలుసా... లక్షసార్లు ఈ తాయెత్తుకి మొక్కితే తీరని కోరికంటూ ఉండదంట. ఏది తలచుకుంటే అది అవుద్దంట" కళ్ళు పెద్దవి చేసి చెబుతూ మరోసారి కళ్ళకద్దుకుంది నెమలి.

నిజమవనీ కాకపోనీ- ఆ అమాయకమైన విశ్వాసానికి ముగ్ధురాలినయ్యాను. "నిజంగానా- అయితే ఇది నాకిస్తావా. నేనెన్నో పరీక్షలు రాయాలి. అవన్నీ పాసవ్వాలి. నాకిలాంటిది చాలా అవసరం. ఇస్తావా మరి" అన్నాను నవ్వులాటకి- బతిమలాడుతున్నట్టు.

ఇబ్బందిగా మొహమాటంగా చూసింది నెమలి.

"వద్దులే. ఊరికినే అడిగాను. నీ దగ్గరే ఉంచుకో" అన్నాను నవ్వుకుంటూ.

తేలికపడింది నెమలి. కానీ, అపరాధమేదో చేసినట్టు కాస్త మొహం ముడుచుకు
పోయింది పాపం.

అప్పటికి రెండువంతుల తోట తిరిగివుంటాం. కొమ్మల మధ్యనుంచి ఎండ ఒంటిమీదపడి చుర్రుమంటోంది.

"ఇక చాలు, వెళ్ళిపోదాం" అన్నాను అలసటగా.

నవ్వింది నెమలి. "సరే"

వచ్చేసేటప్పుడు చూశాను దారికి కాస్త ఎడంగా పెన్సింగుకి ఆనుకుని ఉన్న మంతెన పూలచెట్టు కింద ఓ బొమ్మరిల్లు. అవునది బొమ్మరిల్లే!

"అరె, అది బొమ్మరిల్లు కదూ. ఇది నాకు నువ్వు చూపించనేలేదు" అన్నాను కపటనేరం ఆరోపిస్తూ.

నెమలి మొహం ఎందుకో మ్లానమైంది. కాస్త ఆగి, "రండి చూపిస్తాను" అంది



ఉదాసీనంగా.

మట్టితో కట్టిన చిన్న బొమ్మరిల్లు. కర్రముక్కలతో గుమ్మాలూ కిటికీలూ కూడా అమర్చారు. తాటాకులతో అల్లిన పైకప్పు బావుంది. చాలా బావుంది. ఇంటిచుట్టూరా చెట్లకొమ్మలతో దడి, ఇంటిముందు ఇంటిపెద్దల్లాగా రెండు పెద్ద చెక్కబొమ్మలు. వాళ్ళ పిల్లలకిమల్లే రెండు చిన్నబొమ్మలు. బట్టలుకట్టి పూసల గొలుసులు వేసి... భలేగా ఉన్నాయ్.

"మా తమ్ముడూ నేనూ కలిసి కట్టుకున్నామిది" అంది నెమలి ఖుష్షుగా.

"తమ్ముడా?" ఆశ్చర్యపోతూ అడిగాను, "ఎక్కడా కనిపించలేదే?"

"నాలుగేళ్ళయింది పోయి. జబ్బు చేసింది. ఇక్కణ్నుంచి రెండుమైళ్ళు వెళ్ళాలి ఆస్పత్రికి. తీసుకెళ్ళేలోగానే చచ్చిపోయాడు" చెప్పింది నెమలి గాద్గదికంగా. అంతలోనే కళ్ళు తుడుచుకుని మామూలైపోయింది. "వాడూ, నేనూ ఈ బొమ్మలకి పెళ్ళిళ్ళు చేసేవాళ్ళం. పుట్టినరోజులు చేసేవాళ్ళం. మామిడాకుల బూరలు ఊది బాగా సందడి చేసేవాళ్ళం" అంది ఉత్సాహంగా. "ఇప్పుడవేం లేవు. పాడైపోకుండా చూస్తానంతే" అంది ఉదాసీనంగా.

వచ్చేసేటప్పుడు బొమ్మరింటి గుమ్మంలోనుంచి చెయ్యి లోపలికి పోనిచ్చి ఏదో ఇవతలికి లాగింది నెమలి. అది ఓ నల్లని పట్టుతాడు. ఏడెనిమిది మెరిసే రాళ్ళంటించిన లక్కపూసలు, చింతపిక్కలాంటి గింజ ఒకటీ గుచ్చివున్నయ్ దానికి.

"ఇది మా తమ్ముడి మొలతాడు. వాడి గుర్తుగా దాచుకున్నానిది."

భారంగా వెనుదిరిగాం.

★ ★ ★

ఎంట్రెన్స్‌కి దగ్గరగా వచ్చేసినట్టున్నాం. బామ్మ అదిలింపులూ, మా రఘుగాడి బెదిరింపులూ, మా అమ్మ మందలింపులూ లీలగా వినిపిస్తున్నాయి.

నెమలి ఆగింది. "మీరింక వెళ్ళగలరు కదూ. అమ్మ నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది."

ఎందుకో చాలా దిగులనిపించింది. కొన్ని గంటల్లో నాకింకో ప్రపంచాన్ని చూపించింది. ఆత్మీయతని పంచింది. ఈ నేస్తాన్ని తిరిగి చూడగలనో లేనో.

రెండడుగులు ముందుకు వేసిన నెమలి చటుక్కున వెనక్కొచ్చింది... "నన్ను మరిచిపోరు కదూ" అంటూ విడిచిపెట్టలేనట్టు ఆరాటంగా.

"నెమలీ..." తన చేయి నా చేతిలోకి తీసుకున్నాను ఆప్యాయంగా. తెలీకుండానే కళ్ళల్లో చెమ్మ చేరింది. ఇంతటి అభిమానానికి తనకు నేనేమివ్వగలను? ప్రేమగా చేతులు రెండూ చాచాను నేను.

★ ★ ★

ఆరునెలల తరవాత-

మా ఇంటికి వచ్చాడు అర్జునుడు. పెళ్ళి శుభలేఖ ఇవ్వడానికా..?

కాదు. పురుగు ముట్టి నెమలి చనిపోయింది. ఒంటరిగా ఉండలేక కౌలు వదిలేసి, వాళ్ళ ఊరు వెళ్ళిపోతున్నారట. చెప్పిపోవడానికి వచ్చాడు.

వెళ్ళేముందు నా చేయి చాపమని అందులో పెట్టాడు... తాయెత్తున్న పూసలదండ. దాన్ని నాకిమ్మని మరీమరీ చెప్పి పోయిందట నెమలి.

నీళ్ళు నిండిన నా కళ్ళు మసకబారాయి.

ఎన్నో ఏళ్ళు గడిచాయి. ఇప్పటికీ నెమలి తలపు సన్నజాజి పరిమళంలా నన్నాహ్లాదపరుస్తూనే ఉంది. ★